రేషన్.. పరేషాన్

నూతన జీపీల్లో అవస్థలు
- పంచాయతీలుగా మారినా తొలగని ఇక్కట్లు
- రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి
- కొత్త ప్రభుత్వంపై ఆశలు


లబ్ధిదారులకు రేషన్ సరుకులు తూకం వేస్తున్న డీలర్

దౌల్తాబాద్: నిరుపేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. కానీ, గ్రామ పంచాయతీల్లో చౌకధర దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో అనుబంధ గ్రామాల్లోకి వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తుంది. రేషన్ సరుకుల కోసం 2 నుంచి 3కిలోమీటర్ల దూరం వెళ్లి సరుకులు తీసుకోవాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడంలేదు. ప్రభుత్వం అందజేసే రూపాయికి కిలోబియ్యం తీసుకునేందుకు ప్రైవేటు వాహనాల్లో రూ.20–30 చెల్లించి రేషన్ సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో పరిస్థితి ఇలా..

మండలంలో గతంలో 20 గ్రామ పంచాయతీ ఉండేవి.. ప్రస్తుతం 33 పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. మొత్తం 30 రేషన్ దుకాణాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన నంద్యానాయక్‌తండా, లొట్టికుంటతండా దేవర్‌ఫసల్‌వాద్, ఊరగుంట, ఇందాపూర్, దేశాయిపల్లి ప్రజలు యాంకి గ్రామానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి. నూతన పంచాయతీల్లో రేషన్ షాపులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అనుబంధ గ్రామాలకు వెళ్లి తీసుకురావడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. ప్రైవేటు వాహనాలకు పెట్టే ఖర్చుల ద్వారా తమకు రేషన్ సరుకుల కంటే ప్రయాణ ఛార్జీలు ఎక్కువ అవుతున్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొత్త ప్రభుత్వం స్పందించి రేషన్‌దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్‌షాపు పెట్టాలి



నూతనంగా ఏర్పడిన ప్రతి గ్రామంలో రేషన్‌దుకాణం ఏర్పాటు చేయాలి. ప్రతి నెలా సరుకుల కోసం అనుబంధ గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకుని వెళ్తున్నారు. ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు.

– హీరీబాయి, సర్పంచ్, నంద్యానాయక్ తండా

ప్రతిపాదనలు పంపాం

ప్రస్తుతం మండలంలో 30 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన పంచాయతీల్లో రేషన్ దుకాణా కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. కొత్త దుకాణాలు ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తాను.

– విజయ్‌కుమార్, తహసీల్దార్, దౌల్తాబాద్

స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీఆర్‌సీ ప్రతినిధులు, వ్యాపారులు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరులో వ్యాపారస్తులు తమ వ్యాపారాలను స్వేచ్ఛయుత వాతావరణంలో చేసుకోవచ్చని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం టీఆర్‌సీ(తాండూరు రిక్రియేషన్ క్లబ్)లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని వ్యాపారస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు వ్యాపారులందరూ తన గెలుపునకు సహకరించారన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్‌సీ ప్రతినిధులు, నాయకులు తదితరులున్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

బషీరాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం బషీరాబాద్ మండలం పర్వత్‌పల్లి గ్రామ నాయకులు ఎమ్మెల్యేను కలిసికారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో మనోహర్‌రెడ్డిని గజమాలతో సన్మానించారు. గ్రామంలోని పాఠశాల అదనపు గదుల నిర్మాణాలు చేపడుతానని, అందుకు స్థలం కొనుగోలు చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాశిరెడ్డి, ఆయిల్‌రెడ్డి, పి బసిరెడ్డి, శేరి వెంకటరెడ్డి, శేరి జనార్దన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మాణిక్యప్ప, రామకృష్ణ, రాజు, వీరారెడ్డి పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

పట్టించుకోని అధికారులు

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఆవరణలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన తాగునీటి ట్యాంకు అపరిశుభ్రంగా మారింది. అక్కడ ముళ్ల చెట్లు, గడ్డి పెరిగి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ట్యాంక్ తయారైంది. దర్గా దర్శనం కోసం వచ్చే భక్తులు దర్శనం అనంతరం ట్యాంకు పరిసరాల్లో సేద తీరుతుంటారు. అక్కడ వారికి ఏ క్షణాల్లో ఏం జరుగుతుందో స్థానికులు, భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడి ట్యాంకు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఈదురు గాలులు, వర్షాలు కురిస్తే ట్యాంకు కూలిపోయే ప్రమాదం ఉంది. గతంలో స్థానికులు పలుమార్లు ఈ ట్యాంకును కూల్చివేయాలని అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని స్థానికులు, దర్గాకు వచ్చే భక్తులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దర్గా ఆవరణలోని ట్యాంకును కూల్చి మరో ట్యాంకు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ఎ. పాషా కోరారు. ఆమనగల్లు పట్టణంలోని లిటిల్‌స్కాలర్స్ టెక్నో హైస్కూల్ ఆవరణలో ఆదివారం విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాషా మాట్లాడుతూ కాలనీలో కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నీటి సౌకర్యం, సీసీ రోడ్లు వేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు పాండు, పత్యానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, ఆరీఫ్, రమేశ్, రాఘవాచారి, మల్యానాయక్, తావుర్యానాయక్, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం


ఎమ్మెల్యేను కలిసిన యూటీఎఫ్ సంఘ సభ్యులు

పరిగి: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని జిల్లా యూటీఎఫ్ సంఘ బాధ్యులు ఆదివారం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి ఉపాధ్యాయ సంఘం తరపున ఘనంగా సన్మానించి, వినతి పత్రం అందజేశారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎల్లప్పుడు ప్రజల సమస్యలపై, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్నాని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన జిల్లాను జోగుళాంబజోన్‌లో కలిపితే మొట్టమొదటి సారిగా చార్మినార్ జోన్‌లో కలపాలని పోరాటం చేసింది తానేనన్నారు. విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశలవారీగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రాములు, ఆయ మండలాల అధ్యక్షులు దశరథ్, మేఘ్యా, రమేష్, సక్రియ, రమేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

ధనుర్మాసం ప్రారంభం

- నెల రోజులు తిరుప్పావై పారాయణం
- స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు


ఆలయంలో తిరుప్పావై పారాయణం చేస్తున్న ఆలయ పండితులు

కొడంగల్ రూరల్: గోదాదేవి అమ్మవారు నెల రోజులపాటు స్వామివారి వ్రతాన్ని ఆచరించి భగవంతుడిని భర్తగా వరించిన ధనుర్మాసం ఆదివారం వేకువ జాము నుంచి స్థానిక శ్రీమహాలక్ష్మి దేవాలయంలో ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే కార్యక్రమాల మాదిరిగానే స్థానిక ఆలయంలో వైఖానస ఆగమ శాస్త్ర పద్ధతిలో సంప్రదాయబద్ధంగా నిర్వహించడం విశేషం. సుప్రభాతం నుంచి ఏకాంత సేవ వరకు తిరుమల మాదిరిగానే ఇక్కడి ఆలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు వెల్లడించారు.

సూర్యుడు ధనస్సు రాశిలో శనివారం రాత్రి 12.24గంటలకు ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమైందని తెలిపారు. ఆదివారం వేకువ జాము నుంచే ధనుర్మాస ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఉ. 4గంటలకు వాయిద్యం, 5గంటలకు సుప్రభాతం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 5.30గంటలకు ఆలయ పండితులు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావైలోని మొదటి అధ్యాయం చదివి వినిపించారు. గోదాదేవి అమ్మవారు నెల రోజులపాటు నిష్ఠతో వ్రతాన్ని ఆచరిస్తూ భగవంతుడిని భర్తగా పొందిన క్రమాన్ని అనుసరిస్తూ భక్తులకు తిరుప్పావైలోని మొదటి అధ్యాయం చదువుతూ వ్రత విధానాన్ని వివరించారు. తిరుప్పావైలోని 30పాశురాలు భక్తి రసమైందని, ధనుర్మాస వ్రతం ఆచరించిన వారికి అద్భుతమైన ఫలితాలు అందుతాయని శ్రీకృష్ణ భగవానుడే ఉద్బోధించినట్లు పురాణాల హితోక్తి అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి మంగళహారతులు అందిస్తూ దర్శించుకున్నారు. అనంతరం పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

23న వైకుంఠ ఏకాదశి

పట్టణంలోని శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో 23వ తేదీ శనివారం ఉ.6గంటలకు వైకుంఠ ఏకాదశి(ముక్కోటి ఏకాదశి) వైకుంఠ(ఉత్తర) ద్వార దర్శనం ఉంటుంది. శ్రీమన్నారాయణుడు లోక కళ్యాణార్థం యోగా నిద్ర నుంచి మేల్కొనే పవిత్ర దినం వైకుంఠ ఏకాదశి(ముక్కోటి ఏకాదశి)గా నామాంతరం స్థిరమైనదని పురాణ హితోక్తి. వైకుంఠ ద్వార దర్శనం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో శుభ ఫలితాలు కలుగుతాయి.

–శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు, ఆలయ పండితుడు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ


పల్లకీసేవలో కేరళ వాయిద్యం

కుల్కచర్ల: అయ్యప్పస్వామి మహాపడిపూజ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో అయ్యప్పస్వామి పల్లకీ సేవ కార్యక్రమం శోభాయమానంగా నిర్వహించారు. స్వామి వారిని అయ్యప్పదేవాలయం నుంచి మైసమ్మ చెరువు దగ్గర గల ఆంజనేయస్వామి దేవాలయం వరకు పల్లకీ సేవను నిర్వహించారు. సోమవారం అయ్యప్పస్వామి దేవాలయంలో మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ


సభలో పాల్గొన్న అధికారులు, నేతలు

కుల్కచర్ల: కామునిపల్లి గ్రామ పరిధిలో 2021 నుంచి 2023 వరకు జరిగిన ఉపాధిహామీ పనుల ఆడిట్ సిబ్బంది గ్రామంలో సర్వే నిర్వహించారు. ఆదివారం గ్రామ సర్పంచ్ మైహిపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించి గ్రామస్తులతో చర్చించారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు



దోమ: నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు కోసం తమ దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు సూచించారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు సహాయం రైతులకు అందాలంటే తప్పనిసరిగా ధ్రువపత్రాలతో వ్యవసాయ అధికారుల వద్దకు వచ్చి నమోదు చేసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. పాస్ పుస్తకాలు పొందిన రైతులు, ధరణిలో డిజిటల్ సంతకం పూర్తయి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి రైతుల పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్‌లు ఉండాలని సూచించారు. నమోదు చేసుకోని రైతులకు రైతుబంధు రాదన్నారు.

పత్తికి కనీస మద్దతు ధర ప్రకటించాలి



బంట్వారం: సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.8 వేలు ప్రకటించాలని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీసీఐ కేంద్రాల్లో సరియైన ధర లేకపోవడంతో పత్తి రైతులకు నష్టాలు తప్పడం లేదన్నారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో పంట దిగుబడి లేదని తెలిపారు. పక్క గ్రామాల్లో దళారులు తూకంలో పత్తి రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సరికొత్తగా.. సర్కారు బడి!


నూతన బోర్డుతో కనిపిస్తున్న దీప్లానాయక్‌తండా పాఠశాల

బొంరాస్‌పేట: సర్కార్ బడిని ఎంతో అందంగా, విద్యార్థులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. సకల వసతులతో స్కూల్ భవనం కళకళలాడుతోంది. బొంరాస్‌పేట మండల పరిధిలోని దీప్లానాయక్ తండా ప్రాథమిక పాఠశాల ఉన్నతి కార్యక్రమం కింద ఎంపిక కావడంతో ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు నరేందర్, ఎస్ఎంసీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాటసింగారంలో క్రికెట్ పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రతి ఏటా సంక్రాంతికి ముందుగా నిర్వహించే క్రికెట్ పోటీలు ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలో ప్రారంభమయ్యాయి. బీపీఎల్ –4 (బాటసింగారం ప్రీమియం లీగ్) టోర్నమెంట్‌ను స్థానిక సర్పంచ్ లతాశ్రీ,, ఎంపీటీసీ వెంకటేష్, కో–ఆప్షన్ సభ్యుడు గౌస్ పాష, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధన్‌రాజ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఏసూరి రాజు, అశోక్, సాయిచంద్, సరిపల్లి నవీన్, మహేశ్, రవి, సందీప్, యువకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా పీఆర్టీయూ


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: ఉపాధ్యాయులకు పీఆర్టీయూ సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్ అన్నారు. కుల్కచర్ల మండలం కామునిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సురేష్ క్యాన్సర్ వ్యాధితో కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. కాగా, ఆదివారం పీఆర్టీయూ నేతలు బాధితుల ఇంటికి వెళ్లి సంఘం తరఫున ఒక లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ సంఘం నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తూ ఉపాధ్యాయులకు మేలు చేసేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల మండల పీఆర్టీయూ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పరందాములు, పెంటయ్య, నర్సింలు, వెంకటయ్య, గులాం, శేఖర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు రాక ఇబ్బంది పడుతున్నాం

ఈజీఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్



పరిగి: ఉపాధిహామీ ఉద్యోగుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఈజీఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటన ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా జీతాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిత్యం గ్రామాల్లో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న ఉపాధి ఉద్యోగులను, సిబ్బందిని ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తుందని అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి కార్యక్రమాల్లో ఉపాధిహామీ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అలాగే ప్రజలు వలసలు వెళ్లకుండా ఆపుతూ వారికి ఉపాధిని కల్పిస్తున్నామన్నారు. కానీ, ప్రభుత్వాలు మారినా మా పరిస్థితులు మారడం లేదని వాపోయారు. కొత్త ప్రభుత్వంలోనైనా జీతాలు సకాలంలో వస్తాయని ఆశిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే జీతాలను విడుదల చేసి ఉపాధి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

టోర్నీ విజేతగా షేర్‌హై సుల్తాన్


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పరిగి: పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన పీపీఎల్ సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా షేర్‌హై సుల్తాన్ టీం నిలిచింది. టోర్నమెంట్‌లో మొత్తం 7 టీంలు పాల్గొనగా ఫైనల్‌కు శ్రీకాంత్ 11 టీం, షేర్‌హైసుల్తాన్ టీంలు చేరుకున్నాయి. మొదట బ్యాటింగ్ చేసిన షేర్‌హై సుల్తాన్ ఆరు ఓవర్లలో 30 పరుగులు చేయగా, శ్రీకాంత్ 11టీం ఆరు ఓవర్లలో 16 పరుగులు తీసి రన్నర్‌గా నిలిచింది. విన్నర్‌గా, రన్నర్‌గా నిలిచిన టీంలకు మొదటి బహుమతి, రెండు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. క్రీడలు ఆడటం వల్ల రెండు ప్రాంతాల గ్రామాల మధ్య తత్సంబంధాలు పెరుగుతాయన్నారు. ప్రతి సీజన్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి యువకులను ప్రోత్సాహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకాంత్, సాయి, దుర్గప్రసాద్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ


నర్సింలు స్వామిని సన్మానిస్తున్న స్వాములు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు చేపట్టారు. 18వ దఫా మాలధారణ ధరించిన నరసింహులు స్వామికి గురుస్వాములు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో రవిశర్మ మనోహర్, నరసింహులు గౌడ్, యాదయ్య, కుమ్మరి గోపాల్, అశోక్, శీను, నాగరాజు, సైదుపల్లి మోహన్ రెడ్డి, నాగరాజుగౌడ్, శ్రీనాథం, సాయి, ప్రదీప్, భూపాల్ రెడ్డి, అఖిల్ గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డుపై కంకర.. ఆదమరిస్తే అంతే!

ప్రమాదకరంగా రహదారి


కంకర తేలిన కలెక్టర్ కార్యాలయ రోడ్డు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇది నెహ్రూ ఔటర్ రింగు రోడ్డుకు అనుకొని ఉండటంతో ఈ ప్రాంతంలో కాంక్రీట్ మిక్స్‌డ్(ఆర్ఎంసీ) కేంద్రాలు ఉన్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రహదారి వెంబడి దుమ్ము ధూళి దర్శనమిస్తోంది. దీంతో వాటి అవశేషాలు రోడ్డుపై పడడంతో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ మార్గంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, ఉన్నత స్థాయి అధికారులు ప్రయాణం చేస్తుండటం గమనార్హం.

మలుపు.. రక్షణ చర్యలేవి?

- ఏర్పాటుకు నోచుకోని సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో వాహనదారులు


ప్రమాదకరంగా మలుపు

కొత్తూరు: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలోని మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇక్కడ మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ ప్రమాదకర మలుపులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెంజర్ల నుంచి సిద్ధాపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో పెంజర్ల జెడ్పీహెచ్ఎస్ ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికై న సంబంధితశాఖ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉద్యోగులకు బదిలీ సహజమే

కేశంపేట: ఉద్యోగులకు బదిలీ సర్వ సాధారణమేనని, ఎక్కడ ఉద్యోగం చేసినా ప్రజల మన్ననలను పొందాలని ఎస్ఐ బిఎస్ఎస్ వరప్రసాద్ అన్నారు. కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో 5సంవత్సరాలుగా కానిస్టేబుల్ విధులు నిర్వహించిన ఆరిఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ ఉన్నతి రావడంతో హైదరాబాద్‌లోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఆరిఫ్‌కు వీడ్కోలు నిర్వహించారు. అనంతరం పూలమాల వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆరిఫ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎక్కడ పనిచేసినా నిబద్ధతతో పనిచేయాలని తోటి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నర్సింలుశెట్టి, భీంరాజ్, శివలింగం, రవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.